సాక్షి ప్రకాశం

గురువారం । 18 । ఏప్రిల్ । 2024



ఎల్లో టెన్షన్

ఒంగోలు నగరంలో ప్రధాన ప్రాంతాల్లో హైటెన్షన్ విద్యుత్ వైర్ల సమస్యను ఎమ్మెల్యే బాలినేని పరిష్కరించారు. ఇవేవీ పచ్చపత్రికకు కనిపించలేదు.

- 8లో..



ట్రాక్టర్ బోల్తా..బాలుడు మృతి

ట్రాక్టర్ వాటర్ ట్యాంకర్ బోల్తాపడి బాలుడు మృతిచెందిన సంఘటన రాచర్ల మండలంలోని చినగానిపల్లె గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది.

- 8లో..

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 42/25

పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. వేడిగాలులు వీస్తాయి.



ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి నివాసంలో నిర్వహించిన కల్యాణ మహోత్సవంలో మంగళసూత్రాన్ని చూపుతున్న వేదపురోహితుడు దక్షిణామూర్తి, కల్యాణాన్ని వీక్షిస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి, ప్రణీత్‌రెడ్డి, శ్రీకావ్య తదితరులు



బాలినేని నివాసం వద్ద ఏర్పాటు చేసిన కల్యాణోత్సవంలో ప్రత్యేకంగా అలంకరించిన సీతారాముల ఉత్సవ మూర్తులు



జిల్లా ఎస్పీ కార్యాలయంలో సీతారాముల కల్యాణం సందర్భంగా మంగళసూత్రాన్ని చూపుతున్న ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్

కల్యాణం..కడు రమణీయం

జగదానంద కారకుడైన జగదభిరాముడు, భూజాత సీతాదేవిల కల్యాణ మహోత్సవాలు వాడవాడలా కన్నుల పండువగా జరిగాయి. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లాలోని ప్రతి గ్రామంలోనూ చలువపందిళ్లలో సర్వాలంకరణ భూషితుడైన శ్రీరాముడు, జానకీ మాతల ఉత్సవ విగ్రహాలకు వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణక్రతువు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి దంపతులు తమ నివాసం వద్ద, జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్‌లు సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు.

- సాక్షి నెట్‌వర్క్

న్యూస్‌రీల్

టీడీపీకి మతతత్వ బీజేపీతో పొత్తు సరికాదు

- అందుకే టీడీపీ పదవికి, సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నా
- టీడీపీ రాష్ట్ర మైనారిటీ విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ కరిముల్లా




విలేకరులతో మాట్లాడుతున్న షేక్ కరిముల్లా

ఒంగోలు సబర్బన్: ''తెలుగుదేశం పార్టీ మతతత్వ బీజేపీతో పెట్టుకోవటం సరైన పద్ధతి కాదు. ఏళ్ల తరబడి టీడీపీలో ఉండి పార్టీ ఉన్నతి కోసం కష్టపడ్డాను. అయితే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీతో పెట్టుకోవటం జీర్ణించుకోలేకపోయాను. అందుకే టీడీపీ రాష్ట్ర పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని'' టీడీపీ రాష్ట్ర మైనారిటీ విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి, తెలుగు యువత జిల్లా మాజీ అధ్యక్షుడు షేక్ కరిముల్లా చెప్పారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రైవేటు హోటల్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి కరిముల్లా తన ఆవేదనను వెలిబుచ్చారు. 2005 నుంచి ముస్లిం మైనారిటీల సమస్యల పరిష్కారం కోసం పాటుపడ్డానని చెప్పారు. 2014లో విభజిత ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ అధికారంలోకి రావటంతో పార్టీలో చేరానన్నారు. టీడీపీ ప్రభుత్వం ఒక్క మైనారిటీ ఎమ్మెల్యేకు కూడా మంత్రి పదవి ఇవ్వలేదన్నారు. 2019 ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు బీజేపీ హటావో...దేశ్ బచావో నినాదంతో నిరసన తెలిపారన్నారు. బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను ఖండిస్తూ నల్ల బెలూన్‌లను ఎగుర వేసిన విషయాన్ని కరిముల్లా గుర్తు చేశారు. అయితే ఈ ఎన్నికల్లో మతతత్వ బీజేపీతో పొత్తు పెట్టుకోవటాన్ని జీర్ణించుకోలేక పోయానన్నారు. బీజేపీ కండువాను తన భుజం మీద వేసుకొని మోయలేకనే టీడీపీ పదవికి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. చంద్రబాబు తన రాజకీయ అవసరాల కోసం బీజేపీతో జత కట్టారని రాష్ట్ర అభివృద్ధి కానీ, క్రైస్తవుల, మైనారిటీల సంక్షేమాన్ని పట్టించుకునే స్థితిలో చంద్రబాబు లేరని విమర్శించారు. ముస్లిం సమాజానికి హాని కలిగించే సీఏఏ, ఎన్‌ఆర్‌సీ వంటి చట్టాలను తీసుకొచ్చిన బీజేపీతో కలిసి పనిచేసే అవసరం తనకు లేదన్నారు. రెండు, మూడు రోజుల్లో తన శ్రేయోభిలాషులు, ఆత్మబంధువులు, ముస్లిం మత పెద్దలతో చర్చించి తన రాజకీయ భవిష్యత్తు నిర్ణయాన్ని వెల్లడిస్తానని కరీముల్లా పేర్కొన్నారు.

తొలిరోజే మంచి రోజు

సార్వత్రిక ఎన్నికల కథన రంగంలో కీలక ఘట్టానికి గురువారం శ్రీకారం చుట్టనున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల, వెంటనే నామినేషన్ల ప్రక్రియ షురూ కానుంది. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఒంగోలు పార్లమెంట్‌తో పాటు అన్ని నియోజకవర్గాలకు రిటర్నింగ్ అధికారులను నియమించారు. నామినేషన్ తరువాత అభ్యర్థుల ఖర్చులు, ప్రచారంపై నిఘా పెట్టేందుకు ఏర్పాట్లు చేశారు. తొలి రెండు రోజులు దశమి, ఏకాదశులు కావడంతో ఎక్కువ నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉంది.

- నేడు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల
- నామినేషన్లకూ శ్రీకారం
- 25వ తేదీ ఆఖరి గడువు
- 26న పరిశీలన, 29 వరకు ఉపసంహరణ
- లోక్‌సభకు రూ.25 వేలు, శాసనసభకు రూ.10 వేల డిపాజిట్
- ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు సగం చెల్లిస్తే సరిపోతుంది
- తొలి రెండు రోజులు భారీగా నామినేషన్లు దాఖలు చేసే అవకాశం



జిల్లాలో ఓటర్ల వివరాలు

పురుషులు	మహిళలు	ఇతరులు
9,05,373	9,11,682	107

మొత్తం ఓటర్లు 18,17,162 (ఈ నెల 11వ తేదీ నాటికి)

పోలింగ్ కేంద్రాలు 2,183

జిల్లాలో నియోజకవర్గాలు

జనరల్ : 5

ఎస్సీ రిజర్వు : 3

స్వీకరణ ఇలా..



నేటి నుంచి ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి ఒంగోలు లోక్‌సభ రిటర్నింగ్ అధికారిగా కలెక్టర్ దినేష్‌కుమార్ వ్యవహరిస్తారు. అదేవిధంగా అసెంబ్లీ స్థానాలకు ప్రత్యేకంగా రిటర్నింగ్ అధికారులను నియమించారు. నామినేషన్ల గడువులో ప్రభుత్వ సెలవు రోజులు కాకుండా మిగిలిన రోజుల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల వరకు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వంద మీటర్ల పరిధిలోకి అభ్యర్థికి చెందిన మూడు వాహనాలను మాత్రమే అనుమతిస్తారు. నామినేషన్ల దాఖలు సమయంలో ఆర్‌ఓ వద్దకు అభ్యర్థి సహా ఐదుగురిని మాత్రమే అనుమతిస్తారు.

ఒంగోలు అర్బన్:

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మార్చి 16వ తేదీ ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నేటి నుంచి మరో కీలక ఘట్టం ప్రారంభమవుతోంది. నేడు ఎన్నికల నోటిఫికేషన్ జారీ అవుతోంది. దీంతో మరింత ఎన్నికల వేడి పెరగనుంది. నేడు నోటిఫికేషన్ విడుదల నుంచే నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చు. తొలిరోజే దశమి తర్వాత ఏకాదశి కావడంతో తొలి రెండు రోజుల్లో అధికశాతం మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే అవకాశాలు ఉన్నాయి. ఈ నెల 25వ తేదీ వరకు నామినేషన్లకు గడువు ఉండటంతో అభ్యర్థులు మంచి ముహూర్తం రోజు ఒక సెట్ దాఖలు చేసి తర్వాత భారీ ర్యాలీలతో మరో సెట్ దాఖలు చేసే అవకాశం ఉంది.

నామినేషన్ల పర్వం ఇలా..

జిల్లాలో ఒక పార్లమెంట్, 8 అసెంబ్లీ స్థానాలకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ నేడు నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. అప్పటి నుంచే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. ఈ నెల 26వ తేదీ నామినేషన్ల పరిశీలన ఉంటుంది. 29వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంది. నామినేషన్ల ఉపసంహరణ తర్వాత కేవలం 14 రోజులకు.. అంటే మే 13వ తేదీ పోలింగ్ జరుగుతుంది.

అభ్యర్థులు పాటించాల్సిన అంశాలు...

- ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు భారత పౌరుడై ఉండి నామినేషన్ల పరిశీలన సమయానికి 25 సంవత్సరాల వయసు కలిగి ఉండాలి. భారత పౌరుడినని, రాజ్యాంగానికి, భారత సార్వభౌమాధికారానికి లోబడి నడుచుకుంటానని ప్రమాణపత్రం అందజేయాలి.
- ఆదాయం వచ్చే ప్రభుత్వ పదవిలో ఉండకూడదు.
- నేరారోపణ రుజువై ఉండరాదు. దివాళా తీసి ఉండరాదు.
- శారీరకంగా, మానసికంగా ఆరోగ్యవంతులై ఉండాలి.
- రాష్ట్రంలో ఎక్కడైనా ఓటు హక్కు ఉండవచ్చు. సొంత నియోజకవర్గం కాకుండా వేరే చోట పోటీచేసే అభ్యర్థి తనకు ఓటు హక్కు ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం నామినేషన్‌తో పాటు ఇవ్వాలి. అభ్యర్థిని ప్రతిపాదించే వ్యక్తి అదే నియోజకవర్గం ఓటరుగా ఉండాలి.
- అభ్యర్థులు ప్రత్యేకంగా ఒక బ్యాంకు ఖాతాను ప్రారంభించాలి. తన ఎన్నికల ఏజెంట్‌తో కలిసి జాయింట్ ఖాతా ఏర్పాటు చేసుకోవచ్చు. బ్యాంకు పాస్ పుస్తకాన్ని నామినేషన్ సమయంలో రిటర్నింగ్ అధికారికి అందజేయాలి. లోక్‌సభ స్థానానికి పోటీ చేసే అభ్యర్థులు రూ.25 వేలు, శాసనసభ అభ్యర్థులు రూ.10 వేలు డిపాజిట్ చేయాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే అందులో సగం చెల్లిస్తే సరిపోతుంది.
- నామినేషన్‌తో పాటు కుల ధ్రువీకరణ పత్రం, ఫారం-26 ద్వారా ఆస్తులు, అప్పులు, కేసుల వివరాలతో కూడిన నోటరీ అఫిడవిట్ సమర్పించాలి. నోడ్యూస్ సర్టిఫికెట్ అందజేయాలి.
- ఒక అభ్యర్థి నాలుగు సెట్ల వరకు నామినేషన్ పత్రాలు దాఖలు చేయవచ్చు. డిపాజిట్ మాత్రం ఒకసారి చెల్లిస్తే సరిపోతుంది.
- ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులు. ముందుగా ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రభుత్వం ఆమోదం వచ్చిన తర్వాత మాత్రమే అర్హులు.
- నామినేషన్ల దాఖలులో సహాయ పడేందుకు ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్‌లు ఉన్నాయి.

ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల వరకు బీ-ఫాంతో ఎన్నికల గుర్తు కేటాయింపు:

బీ-ఫాంతో అభ్యర్థులకు ఎన్నికల గుర్తు కేటాయిస్తారు. బీ-ఫాం అంటే గుర్తింపు పొందిన జాతీయ, ప్రాంతీయ పార్టీలు తమ అభ్యర్థులను ప్రతిపాదిస్తూ ఇచ్చే పత్రం. నామినేషన్ సమర్పించే సమయంలో అభ్యర్థులు తమ రాజకీయ పార్టీలు ఇచ్చిన బీ-ఫాం దాఖలు చేయాలి. అప్పుడే అభ్యర్థికి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ గుర్తులను కేటాయిస్తారు. బీ-ఫాంను పార్టీ అధ్యక్షుడు నిర్ణయించిన వ్యక్తి జారీ చేస్తాడు. బీ-ఫాం జారీ చేసేందుకు సంబంధిత వ్యక్తికి పార్టీ అధ్యక్షుడు ఆమోదాన్ని తెలుపుతూ ఏ-ఫాం అందజేస్తారు. ఎవరి పేరుతో ఏ-ఫాం ఉంటుందో ఆ వ్యక్తికి పోటీ చేసే అభ్యర్థులకు బీ-ఫాం ఇచ్చే అధికారం ఉంటుంది.

తనిఖీలు మరింత ముమ్మరం

నామినేషన్ల అనంతరం చెక్‌పోస్టులు, అనుమానిత వాహనాలు, వ్యక్తులను మరింత ముమ్మరంగా తనిఖీ చేస్తారు. రాజకీయాలకు సంబంధం లేని వ్యక్తులు ఎవరైనా ఎక్కువ మొత్తంలో నగదు తీసుకెళ్లేవారు తగిన జాగ్రత్తలు పాటించాలి. నగదును ఎక్కడి నుంచి ఎక్కడికి తీసుకెళ్తున్నారు.? నగదు ఎక్కడి నుంచి అందింది..? ఏ అవసరాల మేరకు తీసుకెళ్తున్నారు వంటి ఆధారాలు చూపాలి. దానిపై తనిఖీ అధికారులు సంతృప్తి చెందకుంటే నగదు సీజ్ చేస్తారు. సరైన ఆధారాలు చూపితే తిరిగి నగదు విడుదల చేస్తారు. అంతే గాకుండా బ్యాంకు లావాదేవీలపై ప్రత్యేక నిఘా ఉంచుతారు. ఎక్కువ మొత్తంలో నగదు బదిలీ అయితే వాటిపై పరిశీలన జరుపుతారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థులకు రూ.40 లక్షలు, ఎంపీ అభ్యర్థులకు రూ.95 లక్షలు మాత్రమే ఖర్చు చేయాల్సి ఉంటుంది. అభ్యర్థుల ఖర్చు లెక్కించేందుకు ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు షాడో అకౌంట్ నిర్వహిస్తారు. ఇన్‌కం ట్యాక్స్, సెంట్రల్ ఎక్సైజ్‌లో యాడీసీ స్థాయి అధికారులతో బృందాలు ఏర్పాటు చేశారు. నామినేషన్ దాఖలు తర్వాత అభ్యర్థి చేసే ప్రతి రూపాయి అకౌంట్‌లోకి వస్తుంది. ఆయా ప్రాంతాల్లో జరిగే ప్రచారం మొత్తం వీడియో తీసి టేపుల్ని పూర్తి స్థాయిలో పరిశీలించేందుకు బృందాలను ఏర్పాటు చేసి ఖర్చు లెక్కిస్తారు. ప్రచార పర్వంలో కండువాలు, జెండాల నుంచి అన్ని ఖర్చులను లెక్కించేందుకు ప్రత్యేక బృందాలు పనిచేస్తాయి.

ఎన్నికల రిటర్నింగ్ అధికారులు...

నియోజకవర్గం	రిటర్నింగ్ అధికారి	ఫోన్ నంబర్
ఒంగోలు పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి	ఏఎస్ దినేష్‌కుమార్, కలెక్టర్	88866 16001
యర్రగొండపాలెం (అసెంబ్లీ-ఏఆర్ఓ)	పోలూరు శ్రీలేఖ	92810 34427
దర్శి (అసెంబ్లీ-ఏఆర్ఓ)	ఎంవీఎస్ లోకేశ్వరరావు	92810 34435
సంతనూతలపాడు (అసెంబ్లీ-ఏఆర్ఓ)	గోపాలకృష్ణ రోణంకి	88866 16002
ఒంగోలు (అసెంబ్లీ-ఏఆర్ఓ)	జి.వి.సుబ్బారెడ్డి	92810 34411
కొండపి (అసెంబ్లీ-ఏఆర్ఓ)	ఎ.కుమార్	92810 34432
మార్కాపురం (అసెంబ్లీ-ఏఆర్ఓ)	ఏ రాహుల్‌మీనా	92810 34413
గిద్దలూరు (అసెంబ్లీ-ఏఆర్ఓ)	డి.నాగజ్యోతి	92810 34426
కనిగిరి (అసెంబ్లీ-ఏఆర్ఓ)	పి.జాన్‌ఇర్విన్	92810 34412

ఎన్నికల నియమావళి పాటించాలి

- నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలి
- సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలి
- ఈ రోజు నోటిఫికేషన్ విడుదలతో పాటు నామినేషన్ల పర్వం కూడా ప్రారంభం
- గుంటూరు రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ట త్రిపాఠి



సమీక్షలో మాట్లాడుతున్న ఐజీ సర్వ శ్రేష్ట త్రిపాఠి, పక్కన ఎస్పీ సుమిత్ సునీల్



సమీక్షకు హాజరైన జిల్లాలోని పోలీస్ అధికారులు

ఒంగోలు సబర్బన్: ఎన్నికల నియమ నిబంధనలకు అనుగుణంగా నియమావళిని పాటిస్తూ ఎన్నికల విధులు నిష్పక్షపాతంగా నిర్వర్తించాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి ఆదేశించారు. ఈ మేరకు ఆయన జిల్లా పర్యటనలో భాగంగా ఒంగోలు వచ్చిన ఐజీ జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పోలీసులతో సమీక్ష నిర్వహించారు. ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్‌తో కలిసి ఆయన జిల్లాలోని పోలీస్ అధికారులకు ఎన్నికల విధులపై దిశా నిర్దేశం చేశారు. క్షేత్ర స్థాయిలో ఎన్నికల కోడ్ అమలును అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలన్నారు. పోలీస్ శాఖ తరఫున చేపట్టాల్సిన అంశాలు, పాటించాల్సిన నియమాల గురించి వివరించారు. ఎన్నికలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేలా పక్కా ప్రణాళికతో అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల్లో నగదు, మద్యం, ఇతర ప్రలోభాలకు సంబంధించిన వస్తువుల సరఫరాకు అడ్డుకట్ట వేసేలా చెక్‌పోస్టుల వద్ద నిరంతరం వాహన తనిఖీలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాలు, వాటికి సంబంధించిన మండలాలు, పోలింగ్ స్టేషన్లు, చెక్ పోస్టుల పూర్తి స్థాయి వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలుసుకున్నారు. ప్రజలకు రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని సూచించారు. ఎన్నికల్లో అక్రమాలపై కఠినంగా వ్యవహరించాలని, ప్రతి ఒక్కరూ తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థులు ఈ నెల 18 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఈ నెల 25 వరకు నామినేషన్ల ప్రక్రియ ఉంటుందని, అందుకోసం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లాకు వివిధ పార్టీలకు చెందిన వీవీఐపీలకు భద్రతా ఏర్పాట్లను, అందుకు సంబంధించిన ముందస్తు సమాచారాన్ని సేకరించాలని సూచించారు. జిల్లాలో ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ల గురించి క్షుణ్ణంగా చర్చించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌ను సందర్శించాలని, అక్కడ ప్రణాళికాబద్ధమైన భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. తగిన మౌలిక వసతులు ఉండేలా చూసుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో జిల్లా ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ప్లాన్ ప్రకారం పటిష్ట బందోబస్తు, కేంద్ర బలగాల మోహరింపుతో తగిన భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని, తరచూ పెట్రోలింగ్ చేయాలన్నారు. ఎన్నికల్లో శాంతికి విఘాతం కలిగించే ట్రబుల్ షూటర్స్, గత ఎన్నికల ఎలక్ట్రోరల్ ఎఫెండర్స్, శారీరక, భౌతిక దాడులకు పాల్పడే వారు, నేర చరిత్ర కలిగిన వారిని బైండోవర్ చేసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో నగదు, మద్యం, ఇతర వస్తువుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేలా జిల్లా వ్యాప్తంగా ఉన్న 18 చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ(అడ్మిన్) కే.నాగేశ్వరరావు, ఏఎస్పీ(క్రైమ్స్) ఎస్‌వి.శ్రీధర రావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్ బాబు, డీఎస్పీలు కిషోర్ బాబు, రామరాజు, అశోక్ వర్ధన్, సీహెచ్. శ్రీనివాసరావు, ట్రైనీ డీఎస్పీ షేక్ షహబాజ్, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్‌తో పాటు జిల్లాలోని సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

22 నుంచి ఫొటోగ్రఫీలో ఉచిత శిక్షణ

ఒంగోలు టౌన్: ఈనెల 22 నుంచి ఒంగోలు నగరంలోని భాగ్యనగర్ రూడ్‌సెట్ సంస్థలో ఉచితంగా ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ పి.ప్రతాప్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 సంవత్సరాలు కలిగిన జిల్లా గ్రామీణ ప్రాంతాలకు చెందిన పురుషులు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచితంగా భోజనం, వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9492583484కు సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

వేసవికి రెండు ప్రత్యేక రైళ్లు ఏర్పాటు

మార్కాపురం: దక్షిణ మధ్య రైల్వే ఈ వేసవికి రెండు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్‌సీసీ మెంబర్ మార్కాపురం పట్టణానికి చెందిన ఆర్‌కెజే నరసింహం బుధవారం తెలిపారు. ట్రైన్ నంబర్ 02811 – హౌరా నుంచి యశ్వంత్‌పూర్ రైలు ఈ నెల 18 గురువారం నుంచి అందుబాటులోకి వస్తుందన్నారు. ట్రైన్ నంబర్ 02811 – భువనేశ్వర్ నుంచి యశ్వంత్‌పూర్ వయా గుంటూరు, నర్సరావుపేట, మార్కాపుర్‌రోడ్, గిద్దలూరు మీదుగా ఈ నెల 20 శనివారం నుంచి అందుబాటులోకి వస్తుందని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గృహంలో మంటలు

● 6 లక్షలు ఆస్తినష్టం



గృహంలో మంటలు వ్యాపించిన దృశ్యం

కొమరోలు: షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో మంటలంటుకున్నాయి. ఈ ఘటన కేంద్రమైన కొమరోలులో బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. కొమరోలులోని ఎస్‌బీఐ వీధిలో నివాసం ఉంటున్న పోలెబోయిన పెద్దరంగయ్య ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా గృహోపకరణాలన్నీ మంటల్లో బూడిదయ్యాయి. ఇంట్లోనే ఉన్న యజమాని పెద్దరంగయ్యను స్థానికులు అతికష్టం మీద బయటకు తీసుకువచ్చారు. హుటాహుటిన గిద్దలూరు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో దాదాపు రూ.6 లక్షల నష్టం వాటిల్లినట్లు యజమాని తెలిపారు.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు



పోటీల్లో పాల్గొన్న ఎడ్ల జత

మార్కాపురం: శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని బొడిచర్ల వీరాంజనేయస్వామి దేవస్థాన ఆవరణలో బుధవారం రాష్ట్రస్థాయి ఎడ్లపోటీలు నిర్వహించారు. పోటీల్లో బొడిచర్ల గ్రామానికి చెందిన టి.నక్షత్రారెడ్డి ఎడ్ల జత 2437 అడుగులు లాగి మొదటి బహుమతిగా రూ.40,116 గెలుచుకుంది. రెండో బహుమతిని పెద్దారవీడు మండలం కలనూతల గ్రామానికి చెందిన జస్వంత్ ఎడ్ల జత 1927.7 అడుగుల దూరం లాగి రూ.30,116, మూడవ బహుమతిని నంద్యాల జిల్లా బేతంచర్లకు చెందిన వెంకటరాముడు ఎడ్ల జత 1457 అడుగులు లాగి రూ.20,116లను, నాల్గవ బహుమతిని రాచర్ల మండలానికి చెందిన జేపీ చెరువు గ్రామానికి చెందిన రవితేజ ఎడ్ల జత 1267.7 అడుగులు లాగి రూ.10,116 గెలుచుకుంది. ఈఓ చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో స్వామి కల్యాణం, అన్నదానం జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నగరం నడిబొడ్డున నాలుగు దశాబ్దాలుగా హై టెన్షన్ విద్యుత్ లైన్‌తో ప్రజల అవస్థలు చెప్పేవీ కావు. అయితే ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని విద్యుత్ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించగానే ఈ సమస్యపై దృష్టి సారించి నిధులు మంజూరు చేయించి మొదటి దశ పనులు పూర్తి చేయించారు. కర్నూలు రోడ్డు, నిర్మల్ నగర్, అంజయ్య రోడ్డు, రాజీవ్ నగర్, ముంగమూరు రోడ్డు జంక్షన్, పాత బైపాస్ రోడ్డు ఏరియాల్లో భూగర్భ విద్యుత్ లైన్ పనులూ పూర్తయ్యాయి. రెండో ఫేజ్ పనులకు నిధులు మంజూరయ్యాయి. అయితే ఇవేమీ పచ్చ పత్రిక ఈనాడుకు కనిపించలేదు. అభివృద్ధిని మరిచి 'ఒంగోలు నెత్తిన హై టెన్షన్' అంటూ అడ్డగోలు కథనం వండి వార్చింది.

ఎల్లో టెన్షన్..!



భూగర్భ విద్యుత్ లైన్ ఐసోలేటర్ యూనిట్

షాక్ చెక్

- జిల్లాలో మొట్టమొదటి భూగర్భ విద్యుత్ లైన్ ఒంగోలులోనే
- రూ.56.74 కోట్లతో మొదటి అండర్‌గ్రౌండ్ కేబుల్ నిర్మాణం పూర్తి
- 40 ఏళ్ల సమస్యకు బాలినేని పరిష్కారం
- రూ.23.79 కోట్లతో రెండో అండర్ గ్రౌండ్ కేబుల్ నిర్మాణానికి నిధులు మంజూరు
- అన్నీ తెలిసినా విషం కక్కుతూ ఈనాడు కథనం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: నగరంలో ప్రధాన ప్రాంతాల్లో ఇళ్ల మీదుగా వెళ్లే హై టెన్షన్ విద్యుత్ లైన్ కంటి మీద కునుకు లేకుండా చేసింది. ఈ లైన్ వద్ద నగరంలో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. దశాబ్దాలుగా ఈ విద్యుత్ లైన్ వల్ల ప్రధాన ప్రాంతాల ప్రజలు వణికిపోయారు. అయితే విద్యుత్ శాఖ మంత్రిగా బాలినేని బాధ్యతలు స్వీకరించగానే ఈ సమస్యపై పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. మొదటి విడతలో రూ.56.74 కోట్లతో పనులు పూర్తి కాగా రెండో విడత పనులకు శంకుస్థాపన చేసి నిధులు మంజూరు చేయించారు.

రూ.56.74 కోట్లతో మొదటి అండర్ గ్రౌండ్ కేబుల్ నిర్మాణం

అత్యంత సాంకేతిక పరిజ్ఞానంతో చేపట్టిన నగరంలోని అండర్ గ్రౌండ్ కేబుల్ పనులను పూర్తి చేశారు. సుమారు రూ.56.74 కోట్లతో మొదటి దశ పనులు పూర్తి కాగా 2022 మార్చిన 5న బాలినేని నగర ప్రజలకు అంకిత చేశారు. జిల్లాలోనే మొట్ట మొదటి భూగర్భ విద్యుత్ కేబుల్ ఇదే. భూగర్భంలో వేస్తున్న ఈ కేబుల్ రెండు లైన్లుగా వేశారు. రెండు లైన్లు పక్క పక్కనే వెళుతుంటాయి. ఒక్కో లైన్ పొడవు 3.1 కిలో మీటర్లు. ముంగమూరు రోడ్డు బైపాస్ జంక్షన్‌కు దక్షిణం వైపున ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయానికి సమీపంలోని 220 కేవీ ట్రాన్స్‌కో విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి కర్నూలు రోడ్డులోని విద్యుత్ పవర్ ఆఫీసులో ఉన్న 132 కేవీ సబ్ స్టేషన్ వరకు ఈ కేబుల్ పనులు పూర్తి చేశారు. ఈ కేబుల్ నిర్మాణంతో ఎలాంటి వాతావరణ విపత్తుల సమయాల్లోనైనా నిరంతరం విద్యుత్ సరఫరా అందించవచ్చు. తద్వారా విద్యుత్ ప్రమాదాలను కూడా నివారించవచ్చు. మంచి నాణ్యమైన విద్యుత్‌ను కూడా అందించేందుకు వీలు కలుగుతుంది. కరోనా విపత్తు సమయంలోనూ అండర్ గ్రౌండ్ కేబుల్ నిర్మాణానికి జర్మనీ నుంచి మెటీరియల్ రావటం ఆలస్యమైనా సకాలంలో భూగర్భ విద్యుత్ కేబుల్ పనులు పూర్తి చేశారు.

రెండో దశకూ నిధులు మంజూరు

మొదటి అండర్ గ్రౌండ్ కేబుల్ నిర్మాణ పనులు పూర్తయిన వెంటనే రెండో దశ కేబుల్ నిర్మాణానికి బాలినేని భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కర్నూల్ రోడ్డు పవర్ ఆఫీసు నుంచి కర్నూలు రోడ్డు దాటుకొని ఉత్తరం వైపును ఉన్న అల్లూరి సీతారామరాజు వీధి, రావి ఆంజనేయులు రోడ్డు, ఎన్‌జీఓ కాలనీ, ఉడ్ నగర్, వెంకటేశ్వర కాలనీ వరకు ఈ కేబుల్ పనులు చేపట్టనున్నారు. అందుకోసం ప్రభుత్వం నుంచి రూ.29.79 కోట్లు మంజూరు చేసింది. మొత్తం 2.80 కిలో మీటర్ల మేర ఈ కేబుల్ పనులు చేపడతారు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజల హై టెన్షన్ విద్యుత్ లైన్ అవస్థలు తీరనున్నాయి.

అత్యంత రక్షణగా..

ఈ భూగర్భ విద్యుత్ కేబుల్ పనులు అత్యంత రక్షణగా చేపట్టారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మిస్తున్న ఈ నిర్మాణ పనుల్లో జర్మనీకి చెందిన విదేశీ విద్యుత్ వాహక పరకరాలను వాడారు. భూమిలో దాదాపు 1.8 మీటర్ల లోతులో విద్యుత్ కేబుల్‌ను వివిధ రకాల పొరల ద్వారా ఏర్పాటు చేశారు. ఆ పొరలు ఇసుక, సిమెంట్ కాంక్రీట్, ప్లాస్టిక్ టేపుల్లాంటి పొరల రక్షణలో విద్యుత్ కేబుల్ నిర్మాణ పనులు నిర్వహించారు. తొలుత కింద 4 అంగుళాల మందంలో ఇసుక నింపారు. ఇసుకపైన 3.5 అంగుళాల మందంలో ఉన్న విద్యుత్ కేబుళ్లను అమర్చారు. ఆ తరువాత 10 అంగుళాల మందంలో ఇసుక పొర ఏర్పాటు చేశారు. ఆ ఇసుకపై కాంక్రీట్‌తో కూడిన సిమెంట్ స్లాబులు అమరుస్తారు. ఆ సిమెంట్ స్లాబులపై 30 సెంటీ మీటర్ల మేర మట్టి పోసి బలీయం చేశారు. ఆ తరువాత మట్టిపై కింద ఉన్న కేబుల్‌కు రక్షణగా జియో గ్రిడ్‌తో కూడిన టేపును పరిచారు. ఆ తరువాత మట్టిని నింపి రోలింగ్ చేశారు.



అండర్ గ్రౌండ్ కేబుల్ ప్రారంభోత్సవంలో బాలినేని (ఫైల్)

బీజేపీ ఉపాధ్యక్షురాలు వైఎస్సార్ సీపీలో చేరిక

- పద్మావతితో పాటు ఆమె కుటుంబ సభ్యులు కూడా
- పార్టీలోకి ఆహ్వానించిన మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి పోకడ నచ్చలేదన్న పద్మావతి



బొమ్మసాని పద్మావతి, కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బాలినేని, పక్కన కుప్పం ప్రసాద్ తదితరులు

ఒంగోలు సబర్బన్: బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు బొమ్మసాని పద్మావతి ఆ పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ మేరకు మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి బుధవారం ఆయన నివాసంలో పద్మావతితో పాటు ఆమె కుటుంబ సభ్యులకు వైఎస్సార్ సీపీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో సముచిత స్థానం ఇస్తామని బాలినేని వారికి భరోసా కల్పించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, రాష్ట్ర ఆర్య వైశ్య ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ ఆధ్వర్యంలో పద్మావతితో పాటు కుటుంబ సభ్యులు వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా బొమ్మసాని పద్మావతి మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా బీజేపీలో అనేక బాధ్యతలు నిర్వహించానన్నారు. కానీ ప్రస్తుతం ఎన్‌డీఏ కూటమిలో జరుగుతున్న పరిణామాలు నచ్చక పార్టీని వీడాల్సి వచ్చిందన్నారు. నూతనంగా రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలుగా బాధ్యతలు చేపట్టిన దగ్గుబాటి పురందేశ్వరి పార్టీని నడుపుతున్న తీరు, ఆమె పోకడ నచ్చక బీజేపీకి రాజీనామా చేశానని తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బీసీలకు, ఎస్సీలకు, ఎస్టీలకు, మైనారిటీలకు, అగ్రవర్ణ పేదలకు పెద్ద పీట వేస్తూ వారిని అన్ని విధాలుగా ఆదుకుంటున్న పద్ధతి నచ్చి వైఎస్సార్ సీపీలో చేరానన్నారు. జిల్లాలో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి పేదల పట్ల చూపిస్తున్న సేవాభావం బాగా నచ్చిందన్నారు. అందుకే కుప్పం ప్రసాద్ ఆధ్వర్యంలో తనతో పాటు తన కుటుంబ సభ్యులు, బీజేపీ పలువురు కార్యకర్తలతో వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు ప్రకటించారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగనన్న, వాసన్న విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని పద్మావతి చెప్పారు. కార్యక్రమంలో కుప్పం ప్రసాద్‌తో పాటు వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, పార్టీ నాయకురాలు తూము పద్మ తదితరులున్నారు.

నేడు బూచేపల్లి నామినేషన్



దర్శి: వైఎస్సార్‌సీపీ దర్శి ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి గురువారం నామినేషన్ వేయనున్నారు. తొలుత ఉదయం 9 గంటలకు రాజంపల్లిలోని ముసి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అక్కడ నుంచి బయలుదేరి దర్శి పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేస్తారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కోరారు.

నా బిడ్డను ఆశీర్వదించండి

నా కుమారుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి ఆశీర్వాదాలు అందించి నామినేషన్ విజయవంతం చేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ కోరారు. మే13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్‌గుర్తుపై ఓట్లేసి వేయించి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ట్రాక్టర్ బోల్తా.. బాలుడు మృతి



బోల్తాపడిన ట్రాక్టర్



ప్రమాదంలో మృతి చెందిన రంగచరణ్

రాచర్ల: ట్రాక్టర్ వాటర్ ట్యాంకర్ బోల్తా పడి బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలోని చినగానిపల్లె గ్రామంలో చోటు చేసుకుంది. చినగానిపల్లె గ్రామానికి చెందిన ఖాశింసాహెబ్ గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలాల్లో ట్రాక్టర్ వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని తెచ్చుకునేందుకు వెళుతున్న సమయంలో అతనితోడుగా గ్రామానికి చెందిన పోలిశెట్టి రంగచరణ్, పెనగనూరి శ్రీహరి అనే ఇద్దరు ట్రాక్టర్‌లో కూర్చుని వెళ్లారు. పొలంలో ట్రాక్టర్ వాటర్ ట్యాంకర్‌లో సగం వరకూ నీటిని పట్టుకుని తిరుగు ప్రయాణమయ్యారు. ఆ సమయంలో చినగానిపల్లె గ్రామ సమీపంలోని మూలమలుపు వద్ద ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడింది. ఆ ప్రమాదంలో పోలిశెట్టి రంగచరణ్ (12) ట్రాక్టర్ కిందపడటంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీహరి అనే మరో బాలుడికి తీవ్రంగా గాయాలు కావడంతో గిద్దలూరు ప్రైవేటు వైద్యశాలలో చికిత్స చేయించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాల తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ ఖాశింసాహెబ్‌కు తలకు తీవ్రంగా గాయపడటంతో గిద్దలూరులో ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. సంఘటన స్థలానికి చెరుకున్న ఏఎస్సై ఆదిశేషయ్య రంగచరణ్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్సై వి.హరిబాబు తెలిపారు.

అప్రమత్తతతో అగ్ని ప్రమాదాల నివారణ



మంటలను అదుపు చేసే విధానాన్ని వివరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఒంగోలు సెంట్రల్: అప్రమత్తతతో అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా అగ్నిమాపక శాఖాధికారి వి.శ్రీనివాసులరెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా క్విజ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. తరగతి గదుల్లో ప్రమాదాలు సంభవించినప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోవాలో వివరించారు. వాటర్, ఫోమ్, కార్బన్‌డై ఆక్సైడ్ వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రజలను అప్రమత్తం చేసేందుకు కరపత్రాలు ముద్రించి పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అగ్నిమాపక, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

జవాబుదారీతనం వైఎస్సార్ సీపీ లక్ష్యం



అంకే పల్లిలో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్



రామాయపాలెంలో ప్రచారం చేస్తున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

● ఉత్సాహంగా పల్లెపల్లెకు సురేష్ సిద్ధం

మర్రిపూడి: ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపిస్తే జవాబుదారీ తనంతో పని చేస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని రామాయపాలెం, వల్లాయపాలెం, అంకేపల్లి పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో బుధవారం పల్లె పల్లెకు సురేష్ సిద్ధం కార్యక్రమంలో మాట్లాడారు. గత ప్రభుత్వంలో పచ్చ నేతలకు మాత్రమే సంక్షేమ పథకాలు అందేవని, కానీ జగనన్న ప్రభుత్వంలో కుల,మత, ప్రాంత, పార్టీలకు అతీతంగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. 5 ఏళ్లలో 130 సార్లు బటన్ నొక్కి నగదును లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రతిపాదించిన ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి, ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనకు ఓట్లు వేసి గెలిపించాలన్నారు. జగనన్నను గెలిపించుకుంటే మీ బిడ్డల భవిష్యత్ బాగుంటుందన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి వలంటీర్‌ల ద్వారా కుల, మత, పార్టీలకు అతీతంగా పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. అదే పథకాలు కొనసాగాలంటే తిరిగి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం ప్రభుత్వంలో దోచుకో.. దాచుకో.. తినుకో తప్ప నియోజకవర్గానికి ఒరగబెట్టింది ఏమీలేదన్నారు. చంద్రబాబు అమలుకాని హామీలు ఇస్తున్నారన్నారు. పొత్తు రాజకీయలను రాష్ట్ర ప్రజలు నమ్మబోరన్నారు. దమ్ముంటే పొత్తులు లేకుండా ఒంటరిగా పోటీచేసి ఎన్నికలకు రావాలన్నారు. ఒక్క అవకాశం ఇస్తే నియోజకవర్గ రూపురేఖలు మార్చి, అన్నివిధాలా అభివృద్ధి చేసి చూపుతానని హామీ ఇచ్చారు. అనంతరం మండలంలోని రేగలగడ్డ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు అంబటి జయరామిరెడ్డి నిర్మల కుమార్తె ధరణి వివాహ విందుకు మంత్రి హాజరయ్యారు. ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు దొద్దాలి మల్లికార్జున, బోగసముద్రం విజయ భాస్కర్‌రెడ్డి, మాకినేని వెంకట్రావు, బోద రమణా రెడ్డి, ఇనుకొల్లు సుబ్బారెడ్డి, బీవీ భాస్కర్‌రెడ్డి, పూనూరి సంజీవరెడ్డి, పాలగుండ్ల సుబ్బారెడ్డి, వై. వెంకట్రావు, డి. నారపరెడ్డి, వై. గోపాల్‌రెడ్డి, పి. కిషోర్‌రెడ్డి, కొండారెడ్డి, వెంకటరెడ్డి, బి. తిరుపతమ్మ, డి. అడివిరెడ్డి, ఎం. వెంటేశ్వర్లు, యర్రమోతు శ్రీను, పి. వెంకటేశ్వర్లు, వి. బ్రహ్మారెడ్డి, పి. సత్యం రెడ్డి, మక్కెన శ్రీను, ఎం. ప్రసాదు, ఎం. బ్రహ్మయ్య, కె. యాకోబు పాల్గొన్నారు.

రాజన్న రాజ్యం జగనన్నకే సాధ్యం



మహిళలకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

పొదిలి రూరల్: రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన రాజన్న పరిపాలన జగనన్నకే సాధ్యమని వైఎస్సార్ సీపీ మార్కాపురం ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా వెంకట రాంబాబు అన్నారు. బుధవారం పొదిలి మండలం అన్నవరం, ఏలూరు, ఉప్పలపాడు, తలమళ్ల, బుచ్చనపాలెం ఎస్సీ కాలనీలో ఎన్నికల ప్రచారం చేశారు. రాంబాబు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పరిపాలనలో రాష్ట్రంలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారన్నారు. ఆయన పరిపాలనలో రైతులకు ఉచిత విద్యుత్, 108, 104, ఆరోగ్య, ఫీజ్ రియింబర్స్‌మెంట్, జలయజ్ఞం వంటి పథకాల పెట్టి దేశానికే ఆదర్శంగా నిలిచారని గుర్తు చేశారు. పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందన్నారు.

జనం నీరాజనం

ఎన్నికల ప్రచారానికి వచ్చిన అన్నా రాంబాబుకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఆయా గ్రామాల్లో స్థానిక నాయకులు గుజ్జుల సంజీవరెడ్డి, గుజ్జుల రమణారెడ్డి, కొత్తపులి బ్రహ్మారెడ్డి, కొత్తపులి అంజిరెడ్డి, కొండ్రుగుంట సుబ్బారావు, కె.శ్రీనివాసరావు, రమణారెడ్డి అధ్వర్యంలో బాణసంచా కాల్చుతూ మేళతాళాలతో, శాలువా కప్పి పూలతో ఘన స్వాగతం పలికారు. తొలుత అగ్రహారం నుంచి అన్నవరం వరకు బైకు ర్యాలీ నిర్వహించారు. ఆ తర్వాత ఆంజనేయస్వామికి, రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రచారం చేస్తూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎవరెవరు ఎంత లబ్ధి పొందారో వివరించి బుక్ అందజేశారు. మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, పంచాయతీ రాజ్ విభాగం కార్యదర్శి కల్లం సుబ్బారెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు గొలమారి చెన్నారెడ్డి, సుభాస్ చంద్రబోస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సాయి రాజేశ్వరరావు, మాజీ ఎంపీపీ కె.నరసింహారావు, వార్డు అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

జగనన్నతోనే పట్టణాభివృద్ధి

● వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణాలను ఎనలేని అభివృద్ధి చేశారని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. బుధవారం పట్టణంలోని చైతన్య నగర్‌లో ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో యర్రగొండపాలెం పట్టణం ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత పట్టణంలో 100 పడకల వైద్యశాల, ఆర్టీసీ బస్టాండ్, టీటీడీ కల్యాణ మండపం, మార్కెట్ యార్డ్ పక్కాభవనాలు, రైతు బజార్, పార్కులాంటివి ఏర్పాటు చేశారన్నారు. అభివృద్ధి చెందాలంటే జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన ఆదేశాలమేరకు తాను ఎమ్మెల్యే అభ్యర్థిగా, చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఒంగోలు పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేస్తున్నామని, ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. నియోజకవర్గ అబ్జర్వర్ వెన్నా హనుమారెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబుల రెడ్డి, బలిజ సంఘం నాయకుడు మిడత నరసింహారావు, వైఎస్సార్ సీపీ క్రిష్టియన్ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు చేదూరి కన్నా, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్ బాష, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, సర్పంచ్ ఆర్.అరుణాబాయి, ఏఎంసీ డైరెక్టర్లు కందుల సత్యనారాయణ, జయరావ్, వై.వెంకటేశ్వరరెడ్డి, సూరె రమేష్, పబ్బిశెట్టి శ్రీనివాస్, కందూరి గురుప్రసాద్, కె.కాశీవిశ్వనాథ్, మెడబలిమి రాజశేఖర్, రావూరి సుబ్బారావు, గోరంట్ల కనకరావు, కొర్రపోలు సుందరరావు, పి.రాములు నాయక్, బి.బాలచెన్నయ్య పాల్గొన్నారు.
